# 1. ఆడపిల్ల తండ్రిని

ఆనాడు ఆఫీసునుంచి ఆలస్యంగా వచ్చిన రమణమూర్తి 'అమ్మయ్యా' అంటూ పడకకుర్చీలో నడుము వాల్చాడు. చొక్కా పాంటూ విప్పలేదు. చివరికి బూట్లు కూడా విప్ప లేదు. ముఖం చూస్తేనే బాగా అలిసిపోయినవానిలా కనిపిస్తున్నాడు. అవును మరి, చేస్తున్నది బ్యాంకు ఉద్యోగం. పరోజు లెక్కలు ఆరోజే పూర్తిచేసి యింటికి రావాలి. అందు లోనూ అది డిసెంబరు ఆఖరివారం!

శివాలయంలో జరుగుతున్న పురాణ కాలక్షేపానికి వెళ్లడం ఆలస్య మయిందన్న విసుగుని వ్యక్తం చేస్తూ, 'ఇదుగోరా నాయనా, కాఫీ' అంటూ రమణమూర్తి తల్లి వేడికాఫీని పడక కుర్చీకి దగ్గరగా ఉన్న చిన్న టేబిలు మీాద పెట్టింది.

'ఉత్తరం వచ్చిందా అమ్మా?'

'ఆ' అని ఒక దీర్ఘం తీసింది తల్లి, గుడికి వెళ్లడం ఆలస్య మైనందుకు అసహనం ప్రకటిస్తూ. ఉత్తరం తీసుకువచ్చి ఆమె మూర్తి చేతి కిచ్చింది. 'ఆడపిల్లట' అంది.

రమణమూర్తిలోని అలసట ఒక్కసారిగా మాయమయింది. అమాంతంగా పడక కుర్చీలోంచి లేచి కూర్చుని ఉత్తరం చదవ సాగాడు.

'వెడుతున్నారా' అంటూ తల్లి దారితీసింది శివాలయానికి.

భార్య సుఖంగా పురుడు పోసుకున్నందుకు సంతోషించాడు మూర్తి. తానూ ఒక తండ్రి అయినందుకు గర్వించాడు. నవజాత శిశువుని చూడాలనే ఉత్కంఠ గూడుకట్టుకుంది.

'ఆడపిల్ల తండ్రిని!' అనుకున్నాడు తనలో తాను. ఉన్నట్టుండి ఏదో భయమూ దిగులూ ఆక్రమించాయి మూర్తి మనస్సుని.

మళ్లీ పడక కుర్చీలో నడుము వాల్చాడు.

మనస్సు పరిపరివిధాల పోయింది.

తన కుమార్తె జీవితం కమల జీవితానికి నకలు కాకూడదనుకున్నాడు. భయకంపితుడైనాడు.

కమలపేరుతో పాటు ఆమె విషాద గాథ కూడా ఒక్కసారి మూర్తికి స్ఫురణకు వచ్చింది.

కమల తన ప్రేయసి! ఎంత మంచిదని. అంత అందకత్తె కాదు. కాని మనస్సు! బంగారం లాంటిది. ఆమెకున్న సంపద అంతా మంచితనమే. ఆమెను తొలిసారిగా యూనివర్సిటీ ఆవరణలో చూశాడు. అప్పుడు మూర్తి యం. యస్సి. చదువుతున్నాడు. చూసిన మరుక్షణమే, ఆమెను తప్ప మరెవ్వరినీ పెళ్లి చేసుకో కూడదనుకున్నాడు. ఆమె కూడ అలాగే అనుకుంది. చివరికి మాత్రం అనుకున్నట్టు జరగలేదు.

ఒకనాడు మూర్తి ధైర్యం చేసి తల్లికి తన కోరికను తెలియజేశాడు. అంతే. ఆమె తోకతొక్కిన తాచులా కనిపించింది.

‘ఎంత ధైర్యం వచ్చిందిరా నీకు! మన యింటావంటా వున్నదిట్రా ఇలాంటి ఆచారం! ఆ పిల్ల యెవరో, యేమిటో—ఏమీ తెలుసుకోకుండా పెళ్లి చేసుకుంటావుట్రా?’

‘చాలా మంచిదమ్మా’

‘నిన్ను బుట్టలో వేసుకునేందుకలా మంచిదిగా నటిస్తోంది. నువ్వు వట్టి పిచ్చివాడివి కాకపోతే, ముక్కూ మొగం తెలియని ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటావుట్రా?’

‘నిజంగా చాలా మంచిదమ్మా. నా మాట నమ్మవూ?’

‘ఇహనైనా ఆ పిచ్చివేషాలు కట్టిపెట్టు. నీ చదువెపుడు పూర్తవుతుందా, ఎపుడు పెళ్లిచేద్దామా అని మీ మామయ్య నీమీద కొండంత ఆశ పెట్టుకుని కూర్చుంటే, వాడి ఆశని కాస్త అడియాస చేస్తావా? పార్వతి నిక్షేపంలాంటి పిల్ల...’

‘అని ఎవరు కాదన్నారు?’ అన్నాడు మూర్తి.

‘అది తెలిసేనా, ఎవరో ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానన్నావు, రత్నంలాంటి పిల్లని వదిలిపెట్టి.’

‘పార్వతికి నేనేం వంక పెట్టడం లేదమ్మా. తెలివైన పిల్ల. అందమైన పిల్ల. నేనే పార్వతికి తగను.’

‘అవేం మాటలురా? అదేం పరాయిది కనకనా?’

‘అది కాదమ్మా, మామయ్య బాగా ఉన్నవాడు. మరి మన సంగతి నేను చెప్పక్కర్లేదు...’

‘ఆ దగ్గ మామయ్యకు లేనప్పుడు, నీ కెందుకురా అనవసరంగా?’

'నేను కనక పార్వతిని పెళ్ళి చేసుకుంటే, చూసేవాళ్ళంతా ఏమనుకుంటారో తెలుసా?'

'ఏమనుకుంటా రేవిటి? ఈడూ జోడూ కుదిరింది. అయిన సంబంధం...'

'కాకిముక్కుకి దొండపండనుకుంటారమ్మా.'

'మగవాడు ఎలావుంటే యేమిరా? కోడలు నలుపైతే కులమంతా నలుపంటారు గాని...'

'ఏమోనమ్మా పార్వతికి నేను తగను' మూర్తి అన్నాడు.

'నీ మొహం నువ్వూను...అంతా నీ యిష్టమనుకున్నా పుత్రా...ఆయనే కనక వుంటే, యీపాటికి పార్వతితో నీకు పెళ్ళి జరిగేది కాదూ...'

ఇక మూర్తి యేమీ మాట్లాడలేక పోయాడు.

తండ్రి తన చిన్నతనంలోనే చనిపోవడం, తదాదిగా తన కోసం తల్లి పడిన పాట్లూ అన్నీ గుర్తుకి వచ్చాయి మూర్తికి. తాను బాగా చదువుకోవాలనీ, పైకి రావాలనీ ఆశించడమే కాదు, అష్టకష్టాలు పడింది. మగదిక్కులేని సంసారమే అయినా ఆ లోటు కనిపించకుండా ఎంతో నేర్పుగా సంసారాన్ని దిద్దుకు వచ్చింది. తాను కాలేజీలో ప్రవేశించినప్పుడు డబ్బు తక్కువయితే తన నగలను అమ్మివేసింది. ఆతర్వాత తనకే విషయం లోనూ ఎటువంటి లోటూ రానీయలేదు. మరి అటువంటి తల్లిమాటను యిప్పుడు కాదనడమా అనుకున్నాడు మూర్తి.

ఆతర్వాత కమల విషయాన్ని తల్లి యెదుట ప్రస్తావించ లేదు రమణమూర్తి. కాని కమలను మోసం చేశానని అప్పు డప్పుడు బాధ పడేవాడు.

తల్లి అనుకున్నట్టుగా పార్వతీ రమణమూర్తుల వివాహం వైభవోపేతంగా జరిగింది. పెళ్లినాడు కూడా మూర్తి మనస్సులో కమల మెదలకపోలేదు. రోజులు గడవను గడవను ఆమెను క్రమక్రమంగా మరిచిపోయాడు, దైనందిన జీవితయాత్రలో పడిపోయి.

ఒకనాటి దినపత్రికలో పిడుగువంటి వార్తను చూశాడు మూర్తి. 'చెరువులో యువతి శవం.' ఇటువంటి వార్తలు పత్రికా పాఠకులకు క్రొత్త కాదు. కాని ఆ విషయాన్ని పూర్తిగా చదవా లనిపించింది మూర్తికి. చదివాడు. కంట తడిపెట్టాడు. గుండె ఆగిపోయినట్లనిపించింది. పరిసరాలన్నీ చీకటిముద్దలా కనిపిం చాయి. ఎక్కడా వెలుగు రేక ఒక్కటైనా కనిపించలేదు.

కొంతసేపటికి తేరుకున్నాడు. ఆ వార్తను మననం చేసుకో సాగాడు మూర్తి. 'చెరువులో శవం... పేరు...కమల... చదువుకున్నది...'

తల్లి వద్దంటున్నా మూర్తి ఆ సాయంకాలం కమల వాళ్ల ఊరికి వెళ్లాడు. కమల తండ్రిని కలుసుకున్నాడు. తాను రమణమూర్తిననీ, కమల స్నేహితుడననీ చెప్పుకున్నాడు.

'ఛీ, దుర్మార్గుడా! నీవల్లనే నా కూతురు చచ్చిపోయింది. ఎందుకొచ్చావ్ యిక్కడికి!' అని గర్జించాడు కమల తండ్రి.

మూర్తి నిలువునా నీరయిపోయాడు. తనవల్ల కమలకు నూరేళ్లూ నిండాయి!

'నేనేం పాపమూ ఎరగనండి, నా మాట నమ్మండి' దీనాతిదీనుడై చెప్పాడు.

'నువ్వు కమలను ప్రేమించావా?'

'అవునండి.'

'పెళ్లి చేసుకుంటానని చెప్పావా?'

'అలా కమలతో అనలేదు కానీండి, పెళ్లి చేసుకోవా లనుకున్నాను.'

'మరి ఎందుకు చేసుకోలేదు?'

'మా అమ్మ ఒప్పుకోలేదు.'

'అయితే నాతో ఎందుకు చెప్పలేదు?'

'చెప్పే ధైర్యం చాలక...'

కమలతండ్రి ఏమీ మాట్లాడలేదు.

'నా మాట నమ్మండి, నేనేం పాపమూ యెరగను' అన్నాడు రమణమూర్తి.

అంతవరకూ రెండవ రుద్రునిలా కనిపించిన కమల తండ్రి కళ్లనీళ్లు గుక్కుకుంటూ, 'ఇప్పుడు ఎవర్నని యేం లాభం? నాయనా, అంతా అయిపోయింది. నా కూతురు నాకు దక్కలేదు. అంతే' అన్నాడు.

రమణమూర్తి మనస్సు వెయ్యి వక్కలయింది. పొంగి వస్తున్న దుఃఖాన్ని అణచుకోలేక పోయాడు. కళ్లు నీటిబుంగ లయినాయి.

'కమల కూడా నీలా ఏ పాపమూ ఎరగనంది. నీచేత ఆ సంగతి చెప్పిస్తానంది. కాని ఆత్రాప్టుడు నమ్ముతేనా? నా తల్లి మీద నాకు నమ్మకం ఉంది...'

రమణమూర్తి కళ్లనుంచి నీటిబొట్లు కింద రాలుతూనే వున్నాయి.

ఆతర్వాత మరికొన్ని వివరాలు తెలుసుకున్నాడు మూర్తి.

ఒకరోజు కమల ఏదో ఒక పుస్తకం చదువుతూవుండగా అప్పుడు ఆమె భర్త ఆమెవద్దకు వచ్చాడనీ, ఆ పుస్తకంలో ఒక చోట రమణమూర్తి సంతకం కనిపించిందనీ, అది యెవరిదని అడగ్గా, అది తన స్నేహితునిదని కమల చెప్పిందనీ, ఆతర్వాత వాళ్లిద్దరి మధ్యా వాగ్వాదం సాగిందనీ కమల తండ్రి చెప్పలేక చెప్పాడు.

కమల తాను నిర్దోషిననీ, తన శీలాన్ని శంకించవద్దని భర్తను కాళ్లావేళ్లా పడి వేడుకుంది. కాని అతడు మాత్రం తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లని కూర్చున్నాడు. కటూక్తులాడి కమల మనస్సుని గాయపరిచాడు. ఇక అటువంటి భర్తతో కాపరం చెయ్యడం కంటె ప్రాణత్యాగం మంచిదనుకుంది. చెరువులో పడి ప్రాణాలు విడిచింది.

కమల విషాదగాథనంతా విని కన్నీరుమున్నీరుగా విలపించాడు రమణమూర్తి. తనవల్లనే ఒక నిండుప్రాణం బలి అయిందనుకున్నాడు.

పడక కుర్చీలోంచి మెల్లగా లేచి కూర్చున్నాడు మూర్తి.

పురాణానికి వెళ్లిన తల్లి అప్పుడే లోపలికి అడుగు పెడుతోంది.

మూర్తి కళ్లు తుడుచుకున్నాడు. పడక కుర్చీలోంచి లేవబోతూవుండగా తల్లి దగ్గరికి వచ్చింది.

'కాఫీ కూడా తాగకుండా, ఇందాకటినుంచీ ఏం చేస్తున్నావురా నువ్వు?' అని అడిగింది.

మూర్తి మాట్లాడలేదు.

‘ఆడపిల్ల తండ్రివయ్యావని అప్పుడే దిగులు పడుతున్నావా యేమిటి?’

‘లేదమ్మా, సంతోషిస్తున్నాను.’

‘ఇప్పుడు సంతోషంగానే వుంటుంది.’

‘ఇప్పుడే కాదమ్మా ఎప్పుడూ సంతోషంగానే వుంటాను. చచ్చిపోయిన కమల మళ్లీ బతికింది’ అన్నాడు రమణమూర్తి గంభీరంగా. అతని కళ్లల్లో ఒక కొత్త వెలుగు కనిపించింది.